ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శనివారం 7 డిసెంబరు 2024



కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాండూరు రూరల్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): సీసీఐలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక నాయకులు శుక్రవారం సీసీఐ జీఎం శరత్ కుమార్, పర్సనల్ ఆఫీసర్ అమిత్‌ను కలిశారు. సీసీఐ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప, తాండూరు సీఐటీయూ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రప్ప తదితరులు వారికి సమస్యల గురించి వివరించారు.

ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించి
హామీలు అమలు చేస్తున్నాం

మిత్తీలకే సరిపోతున్న రాష్ట్ర బడ్జెట్

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పక్కన చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంక్షోభాన్ని సరిదిద్దుతూ అధికార చేపట్టిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం ఆయన ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా తాండూరు మాతాశిశు ఆస్పత్రిలో ఇందిరా మహిళ శక్తి క్యాంటిన్ ప్రారంభించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న వనరులన్నింటినీ గతంలో ఒకే కుటుంబం కొల్లగొట్టి ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే ఆలోచనలలో ఉన్నప్పటికీ ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. కొత్త ఏడాదిలో వచ్చే మార్చి తర్వాత ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు మహిళలకు రూ.2,500 అందజేస్తామన్నారు. ప్రస్తుతం రూ. 58వేల కోట్లు వడ్డీని బడ్జెట్ నుంచి చెల్లిస్తున్నామన్నారు. రాష్ట్ర బడ్జెట్ అంతా మిత్తీలకే సరిపోతుందన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే మొదటి సారి అని అన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను 11లక్షల మందికి అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేని అన్నారు. తాండూరు ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులను కేటాయించారని అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, చైర్‌పర్సన్ స్వప్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు పట్లోళ్ల బాల్‌రెడ్డి, అంజయ్య, ధారాసింగ్, హబీబ్‌లాల, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల తుది మెరిట్ జాబితా విడుదల

వికారాబాద్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న 23 ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) పోస్టుల ఎంపికకు సంబంధించి తుది మెరిట్ జాబితా, సెలెక్షన్ జాబితాను వెబ్‌సైట్(వికారాబాద్.తెలంగాణ.జీవోవీ.ఇన్)లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 9వ తేదీన(సోమవారం) జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులు సంబంధిత పోస్టుల నియామకాలకు సంబంధించి కౌన్సెలింగ్ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని సూచించారు.




యాసంగి కష్టమే?

ఉమ్మడి జిల్లాలో యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. లోటు వర్షపాతం.. అడుగంటుతున్న భూగర్భ జలాలు.. ఈ సారి సాగు విస్తీర్ణంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. గతేడాది ఈపాటికే వరి నాట్లు, ఆరుతడి పంటలు ముమ్మరంగా సాగయ్యాయి. కానీ ఈ ఏడాది యాసంగి సీజన్‌లో కురవాల్సిన వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నకు కష్టాలు తప్పేలా లేవు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగు కష్టమేనని దిక్కులు చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం

- రంగారెడ్డి జిల్లాలో 5 శాతంలోపే పంటలు
- వికారాబాద్‌లో 18.25 శాతం
- ఈ సీజన్‌లో 50 శాతం లోటు వర్షపాతం
- శరవేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- ఆందోళనలో రైతాంగం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) వానాకాలం విస్తారంగా వర్షాలు కురిసి పంటలు సాగు పెరిగినప్పటికీ యాసంగిలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గడిచిన నెల రోజులుగా కనీస స్థాయిలో కూడా వర్షాలు పడకపోవడంతో యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణంగా అక్టోబర్ మొదటి వారం నుంచి యాసంగి సీజన్ ప్రారంభమవుతుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో యాసంగిలో ఆయా పంటల సాగు ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లడం లేదు. మోస్తరు వర్షాలు కూడా లేకపోవడంతో భూమిలో తడిలేక ఆరుతడి పంటలు ఆలస్యమవుతున్నాయి. మరోవైపు వానాకాలం సీజన్‌లో వేసిన వరిపంట కోతలు కూడా ఆలస్యమవుతున్నాయి. గడిచిన రెండు వారాలుగా తుపాన్ కారణంగా మబ్బులు కమ్ముకోవడంతో - మిగతా 6వ పేజీలో..



ఉమ్మడి జిల్లాలో యాసంగి పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సగటు సాగు	గత ఏడాది (ఈ సమయానికి)	ప్రస్తుత సాగు	సాగుశాతం
రంగారెడ్డి	1,02,063	67,866	4,546	4.45
వికారాబాద్	1,11,072	17,054	20,321	18.25
మేడ్చల్	13,849	9,210	56	0.40

హోంగార్డుల సేవలు అభినందనీయం

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలలో హోం గార్డులు పోలీసులతో కలిసి పని చేయాలని, వారి సేవలు అభినందనీయమని ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హోం గార్డ్స్ రైసింగ్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. జిల్లా పోలీసు శాఖలో ఒక భాగమై, పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వహిస్తూ హోంగార్డులు అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందిస్తున్న ముగ్గురు హోంగార్డులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీవీ హన్మంత్ రావు, హోం గార్డ్స్ ప్రెసిడెంట్ సుధాకర్, రాష్ట్ర హోంగార్డ్స్ ఆర్గనైజర్ చాంద్‌పాషా, జిల్లా హోంగార్డ్స్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న శకుంతల

తాండూరు రూరల్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి శిక్షణను యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా మహిళా సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు శకుంతల పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెంగోల్‌లో మహిళల మగ్గం వర్క్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎస్‌బీఐ గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థల ద్వారా శిక్షణ అందిస్తుందన్నారు. 650 మంది నిరుద్యోగ యువతకు పలు విభాగాల్లో శిక్షణ ఇచ్చారన్నారు. ఈ సంస్థలో వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వడమే కాకుండా భోజనం, వసతి కూడా కల్పిస్తారని తెలిపారు.

రుణమాఫీ.. ఇంకెప్పుడు?

- ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 1,230 మందికి వర్తించని మాఫీ 7
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



'ప్రొటోకాల్'పై చీఫ్‌విప్ ఆగ్రహం

- రాజీనామాకు సిద్ధమైన సూపరింటెండెంట్!
- మెప్మా సిబ్బంది, కమిషనర్‌పై మండిపాటు 7
- తాండూరు మాతాశిశు ఆస్పత్రిలో ఘటన



గుంతలను పూడ్చేదెన్నడో?

- నేతల ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలు
- గుంతల రోడ్లను పట్టించుకోని వైనం 8
- వాహనదారులకు తప్పని తిప్పలు



అసైన్డ్ భూములపై అధికారుల విచారణ

- తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆరా
- లోకాయుక్తకు అందించనున్న నివేదిక



తహసీల్దార్ కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న మైన్స్ అధికారులు

తాండూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్కాపూర్ అసైన్డ్ భూములపై రెవెన్యూ, మైన్స్ అధికారుల విచారణ జరిపారు. గ్రామ శివారులో సర్వే నంబర్-75లోని అసైన్డ్ భూముల్లో ప్రభుత్వ, మైన్స్ శాఖ నుంచి అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ జరుపుతున్నారు. ఈ విషయాన్ని ఆ గ్రామానికి చెందిన కొత్తూరు శాంత్‌కుమార్ ఇటీవల రాష్ట్ర లోకాయుక్త, రాష్ట్ర మైన్స్ శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ మైన్స్ శాఖ అధికారులతో కలిసి డిసెంబర్ 28న సర్వేనంబర్-75లో అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. అయితే అక్కడ 20 గుంటల భూమిలో తవ్వకాలు జరిపారని విచారణ తేలిందన్నారు. మరోమారు ఈ నివేదికను లోకాయుక్తకు అందించాల్సి ఉన్నందున శుక్రవారం సాయంత్రం తాండూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి 75 సర్వే నంబర్ సంబంధించిన వివరాలను తహసీల్దార్ తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌కుమార్‌తో చర్చించి సేకరించారు. అయితే ఆ భూమిలో ఎంతమంది తవ్వకాలు జరిపారు? ఎన్ని ఎకరాల్లో తవ్వకాలు జరిపారనేదానిపై సమగ్ర నివేదికను అందిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ విచారణలో మైన్స్ సర్వేయర్ లక్ష్మీనారాయణ, మైన్స్ టీపీ నాగలక్ష్మి ఉన్నారు. ఈ విచారణ నివేదికను త్వరలోనే లోకాయుక్తకు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు.



విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డిస్తున్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే

కొడంగల్‌లో అభివృద్ధి పరుగులు

- వెనుకబడిన ఉమ్మడి పాలమూరుకు మహర్దశ
- విద్యాభివృద్ధితోనే సమాజంలో మార్పు సాధ్యం
- రాష్ట్ర విద్యా విధానంలో త్వరలో మార్పులు
- హరే రామ హరే కృష్ణ ట్రస్టుకు అభినందనలు
- నూతన కాంప్లెక్స్‌ల నిర్మాణంతో పాలన చేరువ
- మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కొడంగల్‌లో రూ.76 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

కొడంగల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో అభివృద్ధి పరుగులు పెడుతుందని, రానున్న నాలుగేళ్లలో మరింతగా రూపురేఖలు మారి రాష్ట్రంలోనే ఆదర్శంగా రూపుదిద్దుకోనుందని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం కొడంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.76 కోట్ల విలు వైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే జిల్లాలో మరో రూ. 24.11 కోట్ల వ్యయంతో చేపట్టే పలు పనులను వర్చువల్‌గా అక్కడి నుంచే ప్రారంభించారు. బొంరాస్‌పేట్ మండలంలో రూ.2.67 కోట్లతో చేపట్టనున్న పాఠశాలల అదనపు గదులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. దౌల్తాబాద్ మండల పరిధిలో రూ.4.13కోట్ల విలువైన అభివృద్ధి పనులకు, దుద్యాల మండలంలో రూ.13.54 కోట్లతో చేపట్టనునన నూతన మండల కాం ప్లెక్స్ నిర్మాణానికి, కొడంగల్ మండల పరిధిలో రూ.3.56కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులక శంకుస్థాపన చేశారు. అనంతరం హరే రామ హరే కృష్ణ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు మాట్లాడారు. కొడంగల్ ప్రాంతంలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో యువత రాణించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం సహచర మంత్రులతో కలిసి పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు. కొడంగల్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఆకలికేకలకు గురికాకుండా ఈ ట్రస్టు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అల్పాహారం అందించడం అభినందనీయం అన్నారు. అంకిత భావం, లక్ష్యంతో పని చేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఈ కేంద్రం నుంచి 8 మండలాలు కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్, గుండుమాల్, కోస్గి, కొత్తపల్లి, మద్దూర్‌లోని 312 ప్రభుత్వ పాఠశాలల్లోని 28 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందనుంది. విద్యాప్రమాణాలు - మిగతా 8వ పేజీలో..

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

టీఎస్ఎస్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్



కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

వికారాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని టీఎస్ఎస్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఈ మేరకు ఉద్యోగులతో కలిసి నిరసన దీక్షను చేపట్టారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. లేకపోతే 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు. హామీ ఇచ్చి ఏడాది గడిచిపోయినా ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతూ ఉద్యోగాలు చేస్తున్నామన్నారు. కేజీబీవీ ప్రత్యేకాధికారులు మాట్లాడుతూ రిలే నిరాహార దీక్షలు, నిరవధిక సమ్మెలో అందరూ విధిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మెసేంజర్ అధ్యక్షుడు శ్రీశైలం, ఎంఐఎస్ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా సమగ్ర శిక్షా కేజీబీవీ ఎస్‌వోలు ప్రభావతి, స్వరూపా, ఆశాలత, మంగమ్మ, శైలజ, స్రవంతి, రాజేశ్వరి, పీటీఐలు అనిల్, జంగయ్య రాఘవేందర్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్‌నాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మర్పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మర్పల్లి జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన ఏ విధంగా ఉందని తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని అధ్యాపకులకు సూచించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి ఇంటర్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. 90 రోజులు కష్టపడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, అధ్యాపకులు పండరీనాథ్, ముస్తాక్, భాస్కర్, రఘువీర్‌దాస్, కార్తీక, శ్రీనివాస్, వెంకటేశ్, లక్ష్మణ్, జమీర్, సమీన, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలి



మహాసభలో మాట్లాడుతున్న సామ్యేల్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపట్టేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామ్యేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో జరిగిన సీపీఎం మున్సిపల్ మూడో మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేకపోతుందన్నారు. రైతు భరోసా లేదని, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు రూ.2500 ఆర్థికసాయం లేదని, ఆసరా పింఛన్లు పెంచి ఇవ్వడం లేదంటూ విమర్శలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మున్సిపాలిటీ కార్యదర్శిగా ఎల్లేష్



సీపీఎం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యదర్శిగా మరోమారు ఎల్లేష్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వీరేషం, బి.యాదగిరి, పురుషోత్తం, ముసలయ్య, శంకర్, స్వప్న, షఫీయున్నీసా, భిక్షపతిలను ఎన్నుకున్నారు.

శ్రీలక్ష్మీ నారసింహ భక్తి గజళ్లు పుస్తకావిష్కరణ



పెద్దేముల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి ద్యావరి నరేందర్‌రెడ్డి రచించిన శ్రీ లక్ష్మీ నారసింహ భక్తి గజళ్ల పుస్తకాన్ని శుక్రవారం ప్రముఖ సినీ దర్శకుడు వేణు ఉడుగుల నగరంలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ద్యావరి నరేందర్‌రెడ్డి తెలుగు గజళ్ల రచనలో 20 ఏళ్లుగా విశేష కృషి చేస్తూ భక్తి, అభ్యుదయ, సామాజిక ప్రణయభావాలతో కూడిన గజళ్లు రాయడం అభినందనీయమన్నారు. సినీ నిర్మాత నాగేశ్వర్ రావు, ప్రముఖ గజల్స్ గాయని డాక్టర్ స్వరూపారెడ్డి, గాయకుడు దివాకర్, వికారాబాద్ జిల్లా లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు టి.మహేందర్, బీజేపీ యువ నాయకులు పి.రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతరం నరేందర్‌రెడ్డిని వారు సన్మానించారు.

యాసంగి కష్టమే?

(5వ పేజీ తరువాయి)

వరి కోతలపై ప్రభావం పడింది. సాధారణంగా వరి సాగు చేసే చోట రెండో పంట వేస్తుంటారు. కోతలు ఇంకా పూర్తికాకపోవడంతో యాసంగి సాగు విస్తీర్ణం కూడా ఇంకా పెరగలేదు. కనీస స్థాయిలో కూడా ఈ ఏడాది పంటలు సాగు జరగలేదు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు యాసంగిలో 4.5శాతమే పంటలు సాగు కావడం గమనార్హం. అయితే వికారాబాద్‌లో మాత్రం పరిస్థితులు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. ఇక్కడ 18.25శాతం పంటల సాగు జరిగింది. మేడ్చల్‌లో కనీసం ఒక్కశాతం కూడా పంటలు వేయలేదు.

51శాతం లోటు వర్షపాతం

మూడు జిల్లాల్లో యాసంగి సీజన్‌లో కనీస స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు సగటు 123.5మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 62మి.మీ వర్షపాతమే కురిసింది. అంటే దాదాపు 51శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 42శాతం, వికారాబాద్ 16శాతం తక్కువ వర్షం కురిసింది. యాసంగిలో పంటల సాగుకు కీలకమైన నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగు తక్కువే..

ఉమ్మడి జిలాలోని పలు ప్రాంతాల్లో భూగర్భజలాలు భారీగా తగ్గిపోవడం యాసంగి పంటల సాగుపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే నవంబరు నెలాఖరు నాటికి భూగర్భజలాలు 1.55 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇదిలా ఉంటే వికారాబాద్ జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 1,11,072 ఎకరాల్లో పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా... ఇప్పటి వరకు 20,321 ఎకరాల్లో పంటలు వేశారు. అలాగే రంగారెడ్డిజిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 1,02,063 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటి వరకు కేవలం 4,546 ఎకరాలు మాత్రమే రైతులు పంటలు వేశారు. అంటే కనీసం అయిదు శాతం కూడా పంటలు సాగు చేయలేదు. గత ఏడాది ఇదే సమయానికి 67,866 ఎకరాల్లో పంటలు వేయడం గమనార్హం. మేడ్చల్ జిల్లాలో సీజన్‌లో కనీసం ఒక్కశాతం కూడా పంటలు సాగు చేయలేదు. అయితే యాసంగి సీజన్‌లో కొన్ని పంటలు వేసేందుకు ఇంకా గడువు ఉండడంతో వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. బోర్లు ఉన్న రైతులు రెండో పంటగా కూడా వరి వేసేందుకే మొగ్గు చూపుతున్నారు.

శరవేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలో సాగునీటి కష్టాలు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గడిచిన నెల రోజుల్లో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడమే ఇందుకు కారణం. వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటడంతో యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత అక్టోబర్ నెలాఖరుతో పోలిస్తే నవంబరు నెలాఖరు నాటికి భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోవడమే ఇందుకు కారణం. రంగారెడ్డిజిల్లాలో గత అక్టోబర్ నెలాఖరు నాటికి 7.71 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా నవంబరు నెలాఖరు నాటికి 9.36 మీటర్ల లోతుకు పడిపోయాయి. అంటే ఒక నెలలో 1.55 మీటర్ల కిందకు నీటి నిల్వలు పడిపోయాయి. అలాగే వికారాబాద్‌లో అక్టోబరు నెలాఖరుతో నవంబరు నెలాఖరు పోలిస్తే 0.21 మీటర్లు నీటినిల్వలు తగ్గాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో ఒక నెలలో 2.60 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సగటుకు మించి వర్షపాతం నమోదైంది. రంగారెడ్డిజిల్లాలో వానాకాలం 32శాతం అధిక వర్షపాతం నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లాలో 41శాతం, మేడ్చల్ జిల్లాలో 21శాతం అధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగానే పెరిగాయి. అయితే యాసంగి ఆరంభం తరువాత వర్షాలు పడలేదు. ఉమ్మడి జిల్లాలో యాసంగిలో దాదాపు 50శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భజలాలు శరవేగంగా పడిపోతున్నాయి. అనేక మండలాల్లో ఇప్పటి వరకు సెంటీమీటర్ వర్షపాతం కూడా నమోదు కాలేదు. మరోవైపు విచ్చలవిడిగా నీటి వాడకం పెరగడంతో శరవేగంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీని ప్రభావం యాసంగి పంటలపై కూడా పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో యాసంగిలో వర్షపాతం (మి.మీ)

జిల్లా	సాధారణం	ఇప్పటి వరకు	తగ్గుదల (శాతంలో)
రంగారెడ్డి	125.3	62.0	51
మేడ్చల్	126.6	72.8	42
వికారాబాద్	102.7	86.6	16

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు చేయాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

కొడంగల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటుతో పాటు నిధులు విడుదల చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందించారు. శుక్రవారం కొడంగల్‌లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రిని వారు కలిసి వినతిపత్రం అందించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.50 కోట్లు విడుదల చేయాలని, పేద బ్రాహ్మణులకు స్వయం ఉపాధి, పిల్లల చదువు కొరకు నిధులు విడుదల చేయాలని కోరారు.

విద్యార్థుల వినూత్న ప్రయోగాలు.. మంత్రి ప్రశంస

కొడంగల్ పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు వొకేషనల్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ కోర్సులో భాగంగా తక్కువ ఖర్చుతో ఎల్‌ఈడీ బల్బులను తయారు చేశారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబుకు విద్యార్థులు తయారు చేసిన ఎల్‌ఈడీ బల్బులను అందించగా.. వారి నైపుణ్యాన్ని చూసి మంత్రి ప్రశంసించారు.

ఏడాదిలో ఏకంగా 4 ఉద్యోగాలు

● టీజీటీ, పీజీటీ, జేఎల్ జాబ్‌లతో సత్తా చాటిన సౌమ్యారెడ్డి



సౌమ్యారెడ్డి, చిలుకూరు గ్రామం మొయినాబాద్ మండలం

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన గడ్డం సౌమ్యారెడ్డి ఏడాది కాలంలోనే ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తా చాటింది. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామానికి చెందిన గడ్డం సౌమ్యారెడ్డికి మొయినాబాద్ మండలం చిలుకూరుకు చెందిన శ్రీధర్‌రెడ్డితో 2014లో వివాహమైంది. ఆ తరువాత కూడా ఆమె చదువు కొనసాగించింది. భర్త ప్రోత్సాహంతో డిగ్రీ పూర్తిచేసిన తరువాత బీఎడ్, ఎంఎస్సీ చదివింది. 2022లో టీజీటీ, పీజీటీ, గురుకులాల జేఎల్‌కు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసింది. 2023లో పరీక్ష రాసి ఉత్తమ ప్రతిభ చూపి ఒకేసారి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించింది. తాజాగా టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించి జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యింది. ప్రస్తుతం గురుకుల జూనియర్ కళాశాలలో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సౌమ్యారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

పార్ట్‌టైం జాబ్‌లు చేస్తూ..

మర్పల్లి: మండలంలోని కల్కోడ గ్రామానికి చెందిన సుశీల, రత్నయ్యలకు ఇద్దరు కూతుర్లు, కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మొగులయ్య గ్రామంలో టెన్త్ వరకు చదివి వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకున్నాడు. అయితే, వారిది పేద కుటుంబ కావడంతో కాలేజీ ముగిశాక వివిధ ప్రైవేట్ కార్యాలయాల్లో పార్ట్‌టైం జాబ్‌లు చేసేవాడు. ఈక్రమంలో 2017లో డీఎస్సీ రాసి ఎస్టీటీ ఉద్యోగం సాధించాడు.మండలంలోని గుర్రంగట్టు తండా పాఠశాలలో పోస్టింగ్ తీసుకున్నాడు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే ఇటీవల జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అదేవిధంగా మొగులయ్య సోదరి నాగలక్ష్మి కూడా అన్న సోదరుడి ప్రోత్సాహంతో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించింది.

డిజిటల్ మార్కెటింగ్‌పై మహిళలకు శిక్షణ



మాట్లాడుతున్న లీడ్ ఇండియా జిల్లా మేనేజర్ శివప్రసాద్

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో డిజైనర్ బ్లౌసెస్, డిజిటల్ మార్కెటింగ్‌పై నెల రోజుల పాటు ఉచిత శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. 30 మంది మహిళలకు నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లీడ్ ఇండియా జిల్లా మేనేజర్ శివప్రసాద్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక చేయూతకు ప్రభుత్వ పథకాలను, బ్యాంకు రుణాలపై వివరించారు. మహిళా సాధికారతకు కృషిచేస్తున్న అభయ అసోసియేషన్ ఎన్జీవోను అభినందించారు. అభయ అధ్యక్షురాలు ఉష, సభ్యులు భాను, షకీలా, అనిత, కోమలారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



రాజశేఖరంనకు జ్ఞాపిక అందిస్తున్న అనురాగ్ వర్సిటీ ప్రతినిధులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు హ్యాకథాన్ కార్యక్రమాల ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఆర్‌డీవో శాస్త్రవేత్త రాజశేఖరం తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాక్ అటాక్ హ్యాకథాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఇంజనీర్లు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ హ్యాకథాన్‌లో వివిధ కళాశాలల నుంచి 710 మంది విద్యార్థులు నమోదుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయ్‌కుమార్, డీన్లు సుధీర్‌రెడ్డి, మహీపతి శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, సతీషశర్మ, శేఖర్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వెయ్యి స్ప్రింక్లర్లు మంజూరు

ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ


విలేకరులతో మాట్లాడుతున్న గీతా నర్సింహ


ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు సబ్సిడీపై వెయ్యి స్ప్రింక్లర్లు మంజూరయ్యాయని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ తెలిపారు. రైతులకు 75శాతం రాయితీ రైతులకు స్ప్రింక్లర్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో గీత మాట్లాడుతూ రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం రూ.23,385 విలువైన స్ప్రింక్లర్లును 75 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు డీడీ తీసి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సందేహాలకు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో ఆమనగల్లు వ్యవసాయ సబ్ డివిజన్‌కు అధిక మొత్తంలో స్ప్రింక్లర్లు మంజూరైనట్లు తెలిపారు. ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, జగన్, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీశైలం, నరేశ్‌నాయక్, అజీం, అంజయ్య, పాండురంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరపాలి


ఘట్‌కేసర్‌లో కార్పొరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఘట్‌కేసర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చూస్తూ శుక్రవారం ఘట్‌కేసర్ ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు విద్యాసంస్థలు ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, అజయ్, వెంకట్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నాగమణి హత్యను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ఇబ్రహీంపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి రాయపోల్ గ్రామంలో ఇటీవల జరిగిన పోలీస్ కానిస్టేబుల్ కొంగర నాగమణి హత్యను నిరసిస్తూ శుక్రవారం రాత్రి పౌరహక్కుల సంఘం, కుల వివక్ష పోరాట కమిటీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కులోన్మాదం పెచ్చుమీరిపోతుందని.. దీనిని ప్రతీ ఒక్కరు తీవ్రంగా ఖండించాలంటూ నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

కనుల పండువగా గుంటం పీర్ల జాతర


గుంటం పీర్లను దర్శించుకుంటున్న స్వరూప, వీరేందర్‌నాగార్జున

తాండూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోటబాస్పల్లి గ్రామ శివారులోని గుంటం పీర్ల జాతరోత్సవాలను రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి ప్రారంభమైన జాతరోత్సవాలను మాజీ సర్పంచ్ కుర్వ నాగార్జున ఆధ్వర్యంలో తాండూరు మండల మాజీ వైస్‌ఎంపీపీ స్వరూపా వెంకట్‌రెడ్డిలు పీర్లకు గంధం నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోటబాస్పల్లి గ్రామానికి చెందిన మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి సోదరుడు, ఇంద్రారెడ్డి చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ నర్సింహారెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట జినుగుర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగప్ప ఉన్నారు. మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వీరేందర్ రెడ్డి, ఎల్మకన్నె పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, మొగులప్ప, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే


శంకర్‌పల్లిలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లిలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.21.40 కోట్లతో చేపట్టే సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంకర్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రగతిపథంలో నిలుపుతానని హామీ ఇచ్చారు. రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం శంకర్‌పల్లిలో పెద్ద ఎత్తున ఇప్పటికే చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నదని ఆయన అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే యాదయ్య పిలుపునిచ్చారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వివరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, డీఈ యాదయ్య, ఏఈ సాయి కిరణ్, కౌన్సిలర్లు శ్రీనాథ్‌గౌడ్, అశోక్, గోపాల్, చంద్రమౌళి, కో-ఆప్షన్ సభ్యుడు షైమూద్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రకాష్, గోపాల్, అశోక్‌కుమార్, రవిందర్‌రెడ్డి, చంద్రమోహన్, రఘునందర్‌రెడ్డి. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ.. ఇంకెప్పుడు?

- ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 1230 మందికి వర్తించని రుణమాఫీ
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ.2లక్షల రుణమాఫీ ఘట్‌కేసర్ మండలంలోని రైతులకు ఇప్పటివరకూ వర్తించలేదు. ఆగస్టు 15లోపు రైతులందరికీ రూ.2లక్షల వరకు సంపూర్ణంగా రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం రైతులకు మాత్రం ఒక్క పైసా కూడా మాఫీ కాలేదు. ఇటీవల సీఎం మహబూబ్‌నగర్‌లో నాలుగో విడత కింద రుణమాఫీ చేసినా ఘట్‌కేసర్ పరిధిలోని రైతులకు మాత్రం మాఫీ అయినట్లు ఎలాంటి సమాచారం రాలేదు. ఘట్‌కేసర్ మండలంలో ప్రధానంగా రైతు సేవా సహకార సంఘం నుంచే రైతులు పంటరుణాలు తీసుకుంటారు. ఇందులో 1230 మందికి రూ.9కోట్ల మేర రుణం తీసుకున్నారు. ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ చేస్తానని ప్రకటించినా తమకు కాలేదని రైతులు వాపోతున్నారు. సహకారం సంఘం చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగతున్నారు. కాగా, వివిధ వాణిజ్య బ్యాంకుల్లో రుణం తీసుకున్న 72 మందికిగాను రూ.కోటీ 25లక్షల రుణమాఫీ అయ్యింది. సహకార సంఘంలో మాత్రం ఆడిట్ జరుగుతోంది.. త్వరలో మాఫీ అవుతుందని అధికారులు మొదటి నుంచీ రైతులకు చెబుతూ వచ్చారు. ఇటీవల సీఎం మహబూబ్‌నగర్‌లో నాలుగో విడత కింద మిగతా రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నామని ప్రకటించినా తమకు వర్తించలేదని ఘట్‌కేసర్ మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆడిట్ పూర్తికాగానే రుణమాఫీ



బ్యాంకులతో పాటు సహకార సంఘం నుంచి పంపించిన డాటా ఆడిట్ జరుగుతోంది. అది పూర్తికాగానే సహకార సంఘంలో రుణం తీసుకున్న రైతులకు మాఫీ అవుతుంది. కమర్షియల్ బ్యాంక్‌లో రుణం తీసుకున్న 72 మంది రైతులకు రూ.కోటీ 25లక్షల రుణ మాఫీ అయ్యింది.

- ఎంఏ బాసిత్, మండల వ్యవసాయాధికారి

పెట్టుబడికి కష్టంగా మారింది



గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ5 వేలు ఇచ్చేది. ఈ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే మళ్లీ పంట రుణం తీసుకోవచ్చని అనుకున్నా. అధికారులు రుణమాఫీ చేస్తే బాగుంటుంది. పంటల సాగుకయ్యే పెట్టుబడికి అప్పు చేయాల్సి వస్తుంది. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నా.

- ఉప్పు లింగేశ్వర్‌రావు, ఎదులాబాద్

రైతులను ఇబ్బందికి గురిచేయొద్దు



రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా ఘట్‌కేసర్ మండల రైతులకు మాత్రం మాఫీ వర్తించలేదు. వానకాలం, యాసంగి పంటలకు రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఆడిట్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. మా మండల రైతులకు రుణమాఫీ చేసి రైతు పండుగలు నిర్వహించాలి.

- పన్నాల కొండల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్

'ప్రొటోకాల్'పై చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి ఆగ్రహం

- రాజీనామాకు సిద్ధమైన సూపరింటెండెంట్!
- మెప్మా సిబ్బంది, కమిషనర్‌పై మండిపాటు


మహేందర్‌రెడ్డి పేరులేని మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన ఆహ్వాన పత్రిక


తర్వాత పేరును చేరుస్తూ ప్రింట్‌చేసిన పత్రిక

తాండూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరు అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని.. ఈ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం తాండూరు పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తనకు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా స్పీకర్ ప్రసాద్ హాజరై ప్రారంభించాల్సిన మాతాశిశు ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవానికి అందరికంటే ముందుగా మహేందర్‌రెడ్డి చేరుకున్నారు. అక్కడ కార్యక్రమానికి సంబంధం లేకున్నా ఆవరణలో ఏర్పాటు చేస్తున్నందుకు అక్కడకు వచ్చిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్‌ను మహేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌పై మండిపడ్డారు. అలాగే మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, మెప్మా టీఎంసీ రాజేంద్రప్రసాద్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా చేస్తే కుదరదని హెచ్చరించారు. కార్యక్రమానికి మెప్మా టీఎంసీ, పీడీ, మున్సిపల్ కమిషనర్‌లు ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించాల్సి ఉండగా.. దాన్ని పాటించలేదు. పద్ధతి మార్చుకోవాలని కమిషనర్‌ను హెచ్చరించారు. సంబంధం లేకున్నా తమపై అనవసరంగా మహేందర్‌రెడ్డి మండిపడటంపై నొచ్చుకున్న సూపరింటెండెంట్ రవికుమార్ తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంలో ఆయనను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అయితే, పూర్తి వివరాలు తెలుసుకోకుండా మహేందర్‌రెడ్డి వైద్యాధికారులపై మండిపడటాన్ని కొందరు తప్పుపడుతూ విమర్శిస్తున్నారు. అసలు మెప్మా అధికారులు మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమకు ఎలాంటి సంబంధం లేదని కేవలం షాప్ కేటాయించే వరకు మాత్రమే తమ బాధ్యత అని డీసీహెచ్‌వో ప్రదీప్‌కుమార్ ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

రేపు జీఈఎస్టీ ప్రవేశ పరీక్ష

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు


మాట్లాడుతున్న రామారావు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ విద్యాసంస్థల ఉపకార వేతనం కోసం డిసెంబరు 8(ఆదివారం) బాలికా విద్యా స్కాలర్‌షిప్ టెస్ట్(జీఈఎస్టీ)ను మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ గ్రామ సమీపంలోని గండిపేట చెరువు ఒడ్డునగల ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో నిర్వహించనున్నట్లు డీన్ ఎన్వీ రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేపు ఎన్టీఆర్ విద్యాసంస్థల ఆవరణలో బాలికా విద్యా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి ప్రకటించినట్లు తెలిపారు. ఇందుకు గాను అర్హులను ఎంపిక చేసేందుకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షకు 10వ తరగతి చదివే బాలికలు అర్హులని వివరించారు. మొదటి పది ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.5వేలు, తర్వాతి 15 ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.3వేల చొప్పున ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 76600-02627 నెంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా, ఒకరోజు ముందు అనగా నేడు కూడా పేర్లు నమోదు చేసుకున్న వారిని పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. జేఈఈ మెయిన్, నీట్, సివిల్స్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్‌తో పాటు ఇంటర్, డిగ్రీ కోర్సులకు సిద్ధం కావాలనుకునే బాలికలకు నాణ్యమైన విద్య, ఆర్థికసాయం అందించడానికి, ప్రతిభావంతులను గుర్తించేందుకు ఎన్టీఆర్ విద్యాసంస్థలు ప్రతీయేటా ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అనుమతుల్లేకుండా క్లినిక్ నిర్వహణ..

అర్హత లేకున్నా వైద్యం

- పరిగిలో క్లినిక్ సీజ్.. మరో దానికి నోటీసులు
- అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండా వైద్యం చేయొద్దు
- డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్


గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డీడీఎంహెచ్‌వో జీవరాజ్

పరిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేని పరిగిలోని గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్ తెలిపారు. శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో, డిప్యూటీ డెమో శ్రీనివాసుల టీం తనిఖీ చేశారు. గ్లోబల్ క్లినిక్‌లో ఎలాంటి విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ లేకుండా ఎంబీబీఎస్ డాక్టర్‌గా చలామణి అవుతున్న రాజు అనే వ్యక్తి క్లినిక్ నిర్వహించడాన్ని గుర్తించారు. విద్యార్హతలకు సంబంధించి సర్టిఫికెట్లు లేనందున క్లినిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే లోటస్ క్లినిక్‌కు రిజిస్ట్రేషన్ లేనందుకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అర్హతలు ఉన్నవారు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అనుమతి పొందిన తర్వాతనే క్లినిక్‌లు నిర్వహించాలని సూచించారు. లేనిచో సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం


పల్లకీ సేవలో మాజీ ఎమ్మెల్యే బక్కని, తదితరులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణ నక్షత్రాన్ని పురష్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించి, ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రవంతి, పరిగి వెంకట సాయీశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, వేముల బాల్‌రాజ్, కానుగు రాంభూపాల్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



దోమ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోత్కూర్ గ్రామంలో అస్వస్థతకు గురై మృతిచెందిన వానరానికి శుక్రవారం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, గ్రామస్థులు సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. డప్పులతో ర్యాలీగా వెళుతూ గ్రామ శివారులో వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఇతర వానరాలు కూడా గుంపుగా అక్కడికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవరాశులను చూసి మనుషులు చాలా నేర్చుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు శివ, వినోద్‌కుమార్, చంద్రశేఖర్‌గౌడ్, గొల్ల రాములు, గ్రామ పంచాయతీ సిబ్బంది హన్మంతు, బాబు, ఎల్లమ్మ పాల్గొన్నారు.

టీడీపీతోనే బలహీన వర్గాలకు గుర్తింపు


ఆమనగల్లులో సభ్యత్వాలు ఇస్తున్న యాదిలాల్

ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు రాజకీయగుర్తింపు ఇచ్చిన ఘనత టీడీపీ కే దక్కిందని టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయ వాది అండేకార్ యాదిలాల్ అన్నారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం మొదలైందని ఆయన అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదిలాల్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాలలో టీడీపీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తలకు గతంలో ఇచ్చే రూ.2 లక్షల ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచడం జరిగిందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు వేగంగా చేపట్టాలని యాదిలాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో వజ్ర లింగం, తిమ్మయ్య, సింహారెడ్డి, బిక్యనాయక్, కాలే శివ, శ్రీనివాస్, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి


బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌గౌడ్

తాండూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులతో కలిసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవించారు. ఈమేరకు శుక్రవారం బండి సంజయ్‌ని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 50 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరమని, ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ది గ్యారంటీల గారడీ : బీజేపీ


పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికారమిస్తే ప్రజల బతుకులు మారుస్తామని ఎన్నికల ముందు ఆరు అబద్ధాలు ఆడిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రాగానే 66 మోసాలకు పాల్పడుతున్నదని బీజేపీ నాయకులు విమర్శించారు. షాద్‌నగర్‌లోని ఏబీ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే బీజేపీ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు మాట్లాడారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను, మహిళలను, నిరుద్యోగులను, యువతను, విద్యార్థులను మోసగిస్తూ పోతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పాలకులు మారారే తప్ప.. ప్రజల బతుకులు మారలేదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయలేదని, రైతు బంధు, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ వంటి పథకాలను ఇవ్వకుండానే సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్ట ప్రజల్లో చైతన్యం తేవడానికి శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తున్నారని, పార్టీ క్యాడర్‌తో పాటు ప్రజలు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. నాయకులు చెంది తిరుపతిరెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేష్ గుప్తా, మోటే శ్రీనివాస్, మఠం రుషీకేష్, హరిభూషణ్ పటేల్, ఎంకనోళ్ల వెంకటేష్, పసుల ప్రశాంత్ తదితరులున్నారు.

కడ్తాల్ : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గారడీలతో ప్రజలను మోసగించిందని ఎస్టీ మోర్చా మండలాధ్యక్షుడు నేనావత్ ప్రేమ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏడాదిలో చేసిన వైఫల్యాలను ప్రజలకు తెలిసేలా శనివారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించి సన్నాహక సమావేశం కడ్తాల మండల కేంద్రంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ ముసుగులో బీఆర్‌ఎస్‌కు ఊడిగం

- రాంబల్‌నాయక్ తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడి హోదాను అడ్డం పెట్టుకున్న రాంబల్‌నాయక్ బీఆర్‌ఎస్‌కు ఊడిగం చేసే పనిని మానుకోకపోతే లంబాడీలే తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ హెచ్చరించారు. షాద్‌నగర్ కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనునాయక్ మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రశ్నించిన ప్రతీ ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపించినప్పుడు నోరు మెదపని రాంబల్‌నాయక్.. బీఆర్‌ఎస్ అధికారం కోల్పోగానే ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా అవతారం ఎత్తి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, పోరాటాలు అంటూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రౌడీషీట్ కేసు పెడితే నిన్ను.. నీ ఆస్తులను రక్షించింది ఎవరో తెలియదా? అని ప్రశ్నించారు. అసత్య ఆరోపణలతో గిరిజనులను మభ్యపెడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూలనాడితే సహించబోమని హెచ్చరించారు. ఉంటే పార్టీలకు సంబంధం లేకుండా గిరిజన నాయకుడిగా ఉండాలని.. అలా బతకలేకపోతే బీఆర్‌ఎస్ నాయకుడిగా కొనసాగాలే తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తే గిరిజనులే బుద్ధి చెబుతారని శ్రీనునాయక్ హెచ్చరించారు. నెహ్రూనాయక్, రూప్లానాయక్, రవీందర్‌నాయక్, బాలునాయక్, ప్రేమ్‌నాయక్, నారాయణనాయక్, తులసీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కసిరెడ్డి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

తలకొండపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కోటి మంది మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని, వారిని కోటీశ్వరులను చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రేవంత్‌రెడ్డి పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఏపీఎం శ్రీదేవి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మల్లమ్మ, బ్యాంకు అధికారులతో కలిసి 70 మంది మహిళా సంఘాలు రూ.9.30 కోట్లు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం కసిరెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలకు శాశ్వత ప్రాతిపదికన నిరంతరం ఆదాయం సమకూరేలా రాష్ట్రం ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గానికి మొదటి విడత 3500 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్లు అంజయ్య, అజీం, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మహిళా సమాఖ్య కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీష, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, అర్హులైన పేదలకు భూమి, ఇళ్లు అనే ఐదు డిమాండ్లతో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారంతో 5వ రోజుకు చేరుకున్నాయి. జిల్లా కన్వీనర్ గొట్టే సురేష్ మాట్లాడుతూ.. ఐదు డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శివకుమార్, పరశురాం, హరినాథ్, శ్రీధర్, మల్లేష్, రాములు, శ్రీనివాస్, బాబు, విజయ్‌బాబు, రమేష్, ప్రవీణ్, అఖిల్, విక్రమ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాకే ఉద్యోగాలు భర్తీ చేయాలి


సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్ మాదిగలు అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు మల్లేపోగు మల్లేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు, మాదిగల ఉద్యమ బలోపేతం, కల్వకుర్తిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతంపై చర్చించారు. ఈ సందర్భంగా సాయన్న, జంగయ్య, కిరణ్‌లు మాట్లాడుతూ మాదిగల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలన్నారు. కల్వకుర్తిలో నిర్వహించే సమ్మేళనానికి మాదిగలు ఉప్పెనల తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా, మండల నాయకులు వీరస్వామి, మైసయ్య, వగ్గు మైసయ్య, కొప్పు యాదయ్య, జంగయ్య, బాల్‌రామ్, సింహాద్రి, సుదర్శన్, కిరణ్, శంకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బోరునీరు వృథా


కామునిపల్లిలో వృథాగా పోతున్న బోరునీరు

కులకచర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో చేతిపంపు బోరు నుంచి నీరు వృథాగా వెళ్తోంది. చౌరస్తాలో చేతి పంపు పాడవడంతో అట్టి బోరులోకి మోటార్‌ను దింపి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. రోజంతా మోటార్ నడుస్తూ నీరు వృథాగా వెళ్తుంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా బోరునీరు వృథా కాకుండా మోటారు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గుంతలను పూడ్చేదెన్నడో?

- నేతల ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలు
- గుంతల రోడ్లను పట్టించుకోని వైనం
- వాహనదారులకు తప్పని తిప్పలు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీలు నిర్వహిస్తున్న అధికార యంత్రాంగం రోడ్లపై గుంతలను పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ కార్యక్రమాల ప్రచారంపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై చూపడంలేదని పలువురు అంటున్నారు. మేడ్చల్‌లో అధికార పార్టీ కౌన్సిలర్లకు, మున్సిపల్ అధికారులకు మున్సిపల్ కార్యాలయానికి కూత వేటు దూరాన ఉన్న హౌజింగ్ బోర్డు మేయిన్ రోడ్డు మధ్య మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. వివేకానంద చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయానికి వచ్చే నాయకులు, ప్రజా ప్రతినిధులందరూ ఈ గుంతను దాటి వస్తున్నా మ్యాన్ హోల్ వైపు కన్నెత్తి చూడటం లేదని వాపోతున్నారు. దాదాపు 15రోజుల నుంచి మ్యాన్ హోల్ గుంత వద్ద ఒక కర్ర పాతి దానికి ఎర్ర బట్ట కట్టేసి వదిలేశారు. వివేకానంద చౌరస్తా నుంచి హౌజింగ్ బోర్డు మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఈ రోడ్డును రెండు సంవత్సరాల కిందట మరమ్మతులు చేయగా కొద్ది రోజులకే మ్యాన్ హోల్‌లు కుంగిపోయాయి. అదేవిధంగాపట్టణంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో జాతీయ రహదారి నుంచి ఉమానగర్ వెళ్లే రోడ్డు మధ్య పెద్ద గుంత ఏర్పడింది. ప్రజాపాలన విజయోత్సవాల సంబురాలు జరుపుకుంటూ వీధులు శుభ్రం చేస్తూ, కాల్వలను శుభ్రం చేస్తూ ఫొటోలకు ఫోజులిస్తున్న ప్రజా ప్రతినిధులు ఇలాంటి సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.


జాతీయ రహదారి-ఉమానగర్ రోడ్డు మధ్య గుంత


హౌజింగ్ బోర్డులో మ్యాన్ హోల్ పక్కన గుంత

సమసమాజ నిర్మాణ దార్శనికుడు అంబేడ్కర్


వికారాబాద్: అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


తాండూరు: అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న నాయకులు


పరిగి: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


మేడ్చల్ టౌన్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


ఘట్‌కేసర్: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని


శామీర్‌పేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన దళితసేన మండల నాయకులు

వికారాబాద్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణ దార్శనికుడు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని మున్సిపల్ మాజీచైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వికారాబాద్‌లోని రైల్వేస్టేషన్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలె లక్ష్మణ్, దీపు, సర్పరాజ్, కృష్ణ, మల్లేశం, జగదీష్ పాల్గొన్నారు.

తాండూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ జయంతి సందర్భంగా తాండూరు అంబేడ్కర్ చౌక్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్‌కుమార్, నర్సింహులు, ఆంజనేయ, మహేందర్, బలరామ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, నరేష్‌రాజు, సీహెచ్ రవి, రాములు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మాజీ వైస్‌ఎంపీపీ స్వరూపా వెంకట్‌రాంరెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం తాండూరు మండలం కోటబాస్పల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, కుర్వ నాగార్జున, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


తాండూరు రూరల్: కోటబాస్పల్లిలో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు

యాలాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో దళిత ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఏఎంసీ డైరెక్టర్ గోసేరి చిన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, అక్బర్‌బాబా, హన్మంతు పాల్గొన్నారు.

పరిగి: అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పరిగిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయా పార్టీల నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

పూడూరు: అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పూడూరు మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జేఏసీ చైర్మన్ దేవునోనిగూడా వెంకటన్న, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, అంబేడ్కర్ విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మంచన్‌పల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తాజుద్దీన్, రాములు, పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని పెద్దనందిగామలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఆరీఫ్, వెంకటయ్య, మాదరప్ప, సీత్యానాయక్, సాయిలు, గోపాల్, గణేష్, సధాకర్, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

దోమ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 68వ వర్ధంతిని మండల కేంద్రంతో పాటు బొంపల్లి అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహేశ్, లక్కీ, ప్రభాకర్, వేణు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసహెబ్ అంబేడ్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మర్రి నర్సింహారెడ్డి, స్వామి యాదవ్, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు. అదే విదంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఈశ్వర్, సాయిపేట శ్రీనివస్, బీజేపీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్, హంస రాణి కృష్ణ గౌడ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మూడుచింతపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి మాజీ సర్పంచ్ జాము రవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘట్‌కేసర్‌లో ఎదులాబాద్ చౌరస్తాలో గల ఆయన విగ్రహనికి మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, నాయకులు మహేష్ గౌడ్, మాధవరెడ్డి, మల్లేష్, అంజనేయులు, రవీందర్, మచ్చేందర్ రెడ్డి, రాదాకృష్ణ, ముత్యాలు పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండల కార్యాలయాల వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి మండల దళిత సేన అధ్యక్షుడు మురళి, ఉపాధ్యక్షుడు బోయిని రాజు, ప్రధాన కార్యదర్శి నీరుడి మల్లేశ్, దళిత సేన, అంబేడ్కర్ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా అలియాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ సర్పంచ్ గుర్క కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లేశ్‌యాదవ్, వెంకటేశ్, మండల బీజేపీ అధ్యక్షుడు కైర యాదగిరి నివాళులర్పించారు.


కులకచర్ల: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు


యాలాల: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత ప్రజాసంఘాల నాయకులు

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


శ్రావణి (ఫైల్)

దుండిగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థిని హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకుంది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా, తాండూర్ మండలం, మైలారం కొత్త తాండాకు చెందిన బలరామ్ కవిత దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రావణి(18) దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్ ఐటీ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతూ కళాశాల వసతి గృహంలో ఉంటుంది. తోటి విద్యార్థినులు శుక్రవారం కళాశాలకు వెళ్లగా ఫ్లోర్ ఇన్‌చార్జ్ శ్రావణిని క్లాస్‌కు ఎందుకు వెళ్లలేదని అడగడంతో కడుపునొప్పి వస్తుందని సమాధానం చెప్పింది. కళాశాల నుంచి మధ్యాహ్నం విద్యార్థినులు హాస్టల్ వచ్చేసరికి గది తలుపు వేసి ఉంది. ఎంతకీ తీయకపోవడంతో కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. యాజమాన్యం వచ్చి, తలుపులు బద్దలు కొట్టి చూడగా విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. విషయం తెలుసుకున్న దుండిగల్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలో సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో 'సారీ మమ్మీ.. కడుపునొప్పి భరించలేకపోతున్నా' అని రాసి ఉందని దుండిగల్ సీఐ సతీష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు సాయంత్రం 5.30గంటలకు కళాశాల వద్దకు చేరుకుని బోరున విలపించారు. తమ కూతురు గురువారం రాత్రి ఫోన్‌లో మాట్లాడిందని, ఆత్మహత్య చేసుకునే అంత పిరికిది కాదంటూ కళాశాల ముందు ధర్నాకు దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు కలగజేసుకుని కుటుంబసభ్యులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

ఉరేసుకొని వ్యక్తి..

మూడుచింతలపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జీనోముఖ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యూపీకి చెందిన సోనుయాదవ్, విప్పెన్‌రావులు ఇద్దరు స్నేహితులు. బతుకుదెరువు నిమిత్తం మండలంలోని లాల్‌గడి మలక్‌పేట్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని కూలీపనులు చేసుకుంటున్నారు. రోజూ మాదిరిగానే విప్పెన్‌రావు కూలీకి వెళ్లగా సోనూయాదవ్ ఇంట్లోనే ఉన్నాడు. విప్పెన్‌రావు సోనుకు ఫోన్ చేయగా ఎంతకీ లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు సమాచారం అందించగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

25కిలోల గంజాయి పట్టివేత

మూడుచింతలపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): 25కిలోల గంజాయిని తరలిస్తున్న ముఠాను శామీర్‌పేట్ పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒరిస్సాకు చెందిన కొందరు కారులో నగరానికి గంజాయిని తరలిస్తున్న సమాచారం మేరకు ఎస్‌వోటీ, శామీర్‌పేట్ పోలీసులు దాడులు నిర్వహించి 25కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చెరువులో యువకుడు గల్లంతు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన యువకుడు నీటిలో గల్లంతయ్యాడు. ఈ ఘటన మేడ్చల్ మండలం డబిల్‌పూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డబీల్‌పూర్ గ్రామానికి చెందిన రాజేంద్ర బారిక్(25) శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. కాగా చెరువు ఒడ్డున రాజేందర్ సైకిల్, సెల్‌ఫోన్, దుస్తులు పడి ఉండటం గమనించిన స్థానికులు రాజేందర్ నీటమునిగి ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువు వద్దకు చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో సాయంత్రం చీకటి పడేంత వరకు చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా రాజేంద్ర బారిక్ ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం ఉదయం తిరిగి గాలింపుచర్యలు చేపడుతామని పోలీసులు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు


రాజిరెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

దోమ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, హరీశ్‌రావుల అరెస్టులను నిరసిస్తూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకుండా బీఆర్‌ఎస్ నాయకులను దోమ పోలీసులు శుక్రవారం ముందస్తుగా హౌస్‌అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ అరెస్టులతో పోలీసు రాజ్యంతో పరిపాలన కొనసాగిస్తుందని ఆరోపించారు.

10 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

శామీర్‌పేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్‌లోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు సీఎం కప్-2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ వెంకటగోపాల్‌లు తెలిపారు. వారు తూంకుంట మున్సిపల్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కప్ క్రీడాపోటీల్లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో యోగా క్రీడలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులు తూంకుంట మున్సిపల్ కార్యాలయానికి గానీ, ఆన్‌లైన్‌లో గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల వెల్లడించారు.

ప్రజాపాలన విజయోత్సవాలు


కౌకూర్‌లో ప్రజాపాలన విజయోత్సవాల ప్రచారం

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు-2024లో భాగంగా శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల బృందాలు ప్రజాపాలన కళాయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా యాప్రాల్, కౌకూర్ గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం నిర్వహించారు.

కొడంగల్‌లో అభివృద్ధి పరుగులు

(5వ పేజీ తరువాయి)

మెరుగుపర్చేందుకు విద్యా విధానంలో ప్రభుత్వం మార్పులు తీసుకరానుందని వారు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టుల ప్రారంభానికి చర్యలు

వెనకబడిన ఉమ్మడి పాలమూరు జిల్లాకు మహర్దశ ప్రారంభమైందన్నారు. జిల్లాను అభివృద్ధి పర్చేందుకు పక్కా ప్రణాళికతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య పనులతో పాటు రైతులకు సాగు నీరందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వ్యవసాయ ఆధారంగా జీవనం కొనసాగిస్తున్న ఈ ప్రాంత రైతులకు సాగునీటిని అందించే అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు.


అల్పాహార కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రులు

గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందన్నారు.

అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు

అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలు ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్పాహారం కిచెన్ షెడ్డులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, వయాట్రిస్ హెడ్ మీచెల్ డోమినికా, అర్పన, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్‌లు జగదీశ్వర్‌రెడ్డి, అన్నపూర్ణ, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నాయకులు ముద్దప్పదేశ్‌ముఖ్, నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ'ని అందుబాటులోకి తేవడం హర్షణీయం


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చిత్రంలో చీఫ్‌విప్, ఎమ్మెల్యే

తాండూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఆరోగ్యశ్రీ సేవలను అందుబాటులోకి తేవడం హర్షణీయమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. తాండూరులో తాండూరు పట్టణం శాంతినగర్ కాలనీలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, గిరిజన నాయకుడు విఠల్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆయన ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మొట్టమొదటి సారి జిల్లాలోనే గుండె వైద్య సేవలు అందుబాటులోకి తేవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింహులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, మాజీ డీసీసీబీ సభ్యులు పట్లోళ్ల నర్సింహులు, బీఆర్‌ఎస్ నాయకులు విఠల్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలపై కేసులు ఎత్తివేయాలి

తాండూరు: ఆర్‌ఎంపీలపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డిని ఆర్‌ఎంపీలు కోరారు. తాండూరుకు గురువారం వచ్చిన ఆయనను నివాసంలో తాండూరు, బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, కోట్‌పల్లి మండలాలకు చెందిన ఆర్‌ఎంపీలు కలిసి వినతిపత్రంతో పాటు సమస్యలను వివరించారు. తమపై ఆరోగ్యశాఖ అధికారుల దాడులు పెరిగాయని, అకారణంగా కేసులు నమోదు చేస్తున్నారని వాపోయారు. స్పందించిన చీఫ్‌విప్ ఉన్నతాధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు పాల్గొన్నారు.

అలరించిన అంధుల పాటల కచేరి

పరిగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వరవేదిక సొసైటీ వారి ఆధ్వర్యంలో పరిగిలోని శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం అందులు పాటల కచేరితో అలరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన అందులు పాటల కచేరిలో చాటిన ప్రతిభతో అందరిని అబ్బురపరిచింది. సినీపాటలు, దేశభక్తి పాటలు, ప్రేరణ కల్గించే పాటలను పాడారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.మల్లేశ్ వారిని అభినందించి సత్కరించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


విద్యార్థులతో ఉపాధ్యాయులు

దోమ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, నర్సింహులు, మల్లమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

కులకచర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగోవిందు తండాలో ఆంజనేయస్వామి, కాళికమాత విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం షష్టి గణపతి హోమం, ఆదివారం లోకమానంద్ ఆలయం ఆవరణలో ఆంజనేయస్వామి, కాళికామాత విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగులను ఆదరించాలి


నైబర్‌ఫుడ్ సెంటర్‌లో కేక్‌కట్ చేస్తున్న డీపీఎం సురేఖ

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులను ఆదరించాలని గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) సురేఖ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్‌లోని నైబర్‌ఫుడ్ సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమలో అధికారులు మాధురి, నైబర్‌ఫుడ్ సెంటర్ ప్రతినిధులు శంకర్, నర్సింహ్మా, దివ్యాంగులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


బొంరాస్‌పేట్‌లో వర్షం

బొంరాస్‌పేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ వేడిమికి గురైన ప్రజలు కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో వర్షపు నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

పూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం సామాజిక తనిఖీ సమావేశం జరిగింది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీలో భాగంగా డీఆర్‌డీవో శ్రీనివాస్, డీవోపీ రాములు 2023-24 సంవత్సరంలో చేపట్టిన రూ.5.50కోట్ల నిధులకు సంబంధించి మండల పరిధిలోని 31గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ ధ్రువపత్రాలను, ఫీల్డ్ ఆఫీసర్స్ చేయించిన పనుల విరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ రమేష్ బృందం, అధికారులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంపుపై అవగాహన


పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త అంజు భాసర

దోమ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు మేలు రకం గడ్డి అందించడం ద్వారా పాల ఉత్పత్తి మెరుగు పడుతుందని ప్రాంతీయ పశుగ్రాస కేంద్రం హైదరాబాద్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అంజు భాసర అన్నారు. మండలంలోని శివారెడ్డిపల్లిలో శుక్రవారం పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు మార్కెట్‌లో లభించే దాణ స్థానంలో మేలు రకం గడ్డిని పెంచి పశువులకు మేతగా వేస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పాడి రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి, ఎన్.రాంరెడ్డి, విక్రంరెడ్డి, నర్సింహులు, రామచంద్రయ్య పాల్గొన్నారు.